## క్లుప్తంగా

### వంతెనను పునర్నిర్మించాలి



వంతెనపై ఏర్పడిన రంధ్రాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**ఓర్వకల్లు:** మండలంలోని నన్నూరు గ్రామ శివారులో అంకాలమ్మ గుడి సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద కూలిన వంతెనను పునర్నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు వంతెనపై ఏర్పడిన రంధ్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి అంకాలమ్మ గుడి వైపునకు వెళ్లే శ్మశాన వాటిక వద్ద ఐదేళ్ల క్రితం నిర్మించిన వంతెనపై సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుపకడ్డీలతో రంధ్రాలు ఏర్పడినట్లు తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తారని, ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్, మండల కమిటీ సభ్యులు మల్లేష్, స్వాములు, వలి బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### జాతర పోస్టర్ విడుదల



పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

**గడివేముల:** మండల కేంద్రంలోని మూల పెద్దమ్మ జాతర పోస్టర్లను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కర్నూలులోని తన ఇంట్లో ఈఓ రామలింగారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### పొగాకు దిగుబడుల చోరీ

**పాణ్యం:** మండల పరిధిలోని కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన పొగాకు దిగుబడి చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 10న రైతు చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రూ. 4లక్షల విలువైన 20 క్వింటాళ్ల పొగాకు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వారం రోజులుగా గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాకపోవడంతో రైతు ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**కల్లూరు:** త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు నాగయ్య, పురుషోత్తం, కళ్యాణ్, మధువాణి, ప్రమీల, రాజేశ్వరి పాల్గొన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కల్లూరు:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీఓ ఐ. శ్రీదేవి, కేవీ సుబ్బారెడ్డి, జయా స్టీల్ సీఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**కల్లూరు:** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్య తదితరులు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఉత్సవ కమిటీ నియామకం

**గడివేముల:** మండల కేంద్రమైన గడివేములలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు జరగనున్న మూలపెద్దమ్మ జాతర సందర్భంగా ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గడివేములకు చెందిన దేశం రమణారెడ్డి, ఆదినారాయణ శర్మ, బానాల పుల్లమ్మ, లక్ష్మీదేవి, వెంకటమ్మ, సంజమ్మ, గోపాల్, మంగళి పక్కిర య్య, చిన్న నాగన్న కమిటీ సభ్యులుగా నియమించారు. కమిటీ కాలపరిమితి ఉత్సవాలు ముగిసే వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో !

- రోడ్డు నిర్మాణం చేపట్టని కూటమి ప్రభుత్వం
- తూతూ మంత్రంగా మరమ్మతు పనులు
- అధ్వానపు రోడ్డుపై ప్రయాణాలు చేయలేక ప్రజల ఇక్కట్లు





అధ్వానంగా ఉన్న కోడుమూరు-వెల్దుర్తి రోడ్డు

**కోడుమూరు రూరల్:** కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రయాణాలు చేయలేని విధంగా తయారైంది. వెంకటగిరి నుంచి లద్దగిరి వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై గుంతలను దాటుకుని వెళ్లాలంటే వాహనదారులకు 12 కిలోమీటర్ల దూరానికి గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లలేక వెంకటగిరి నుంచి ఎర్రదొడ్డి, అనుగొండ, అల్లినగరం గ్రామాల మీదుగా లద్దగిరి వెళ్లి అక్కడి నుంచి వెల్దుర్తికి వెళుతున్నారు. ఈ మార్గంలో వెళితే 10 కిలోమీటర్ల దూరం అదనంగా పెరుగతుంది. మరి కొందరు వాహనదారులు వెంకటగిరి, ఎర్రదొడ్డి క్రాస్ రోడ్డు మీదుగా గోరంట్లకు వెళుతున్నారు. ఈ మార్గంలో వెళ్లినా 5 కిలోమీటర్ల దూరం అదనంగా పెరుగుతుంది.

**తూతూ మంత్రంగా మరమ్మతు పనులు**

ఇటీవల కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో రోడ్ల మరమ్మతులు చేపట్టింది. అయితే కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డులో అధికారులు కేవలం జేసీబీతో రోడ్డు పక్కనున్న మట్టిని వేసి తూతూమంత్రంగా కొన్ని గుంతలు పూడ్చి చేతులు దులుపుకున్నారు. దీనివల్ల రోడ్డు పక్కన గుంతలు పెట్టడం తప్ప ఒరిగిందేమీ లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

**జాతర నాటికైనా గుంతలను పూడ్చరూ..**

జిల్లాలోని అతి పెద్ద జాతరలో కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామంలో జరిగే శ్రీలక్ష్మిమాధవ స్వామి జాతర ఒకటి. ఈనెల 20వ తేదీన గోరంట్ల మాధవుడి రథోత్సవం జరగనుంది. వారం రోజుల పాటు జరిగే జాతరను చూసేందుకు, స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచే గాక తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు. అయితే గోరంట్లకు వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనను ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులైనా చేయించి, గుంతలను పూడ్చివేస్తే కొంత మేర వాహనదారులు ప్రయాణాలు చేసేందుకు సౌకర్యంగా ఉంటుందని గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**నిత్యం ఇబ్బందులు పడుతున్నాం**



కోడుమూరు, వెల్దుర్తి నుంచి గోరంట్లకు వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారింది. రోడ్డును బాగు చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గుంతలమయమైన రోడ్డుపై నిత్యం భయం భయంగా ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తే బాగుంటుంది. – గోపాల్, గోరంట్ల

**త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం**

కోడుమూరు నుంచి వెల్దుర్తి వెళ్లే రోడ్డులో 3వ కిలోమీటర్ నుంచి 14.5 కిలోమీటర్ వరకు మొత్తం 11.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.19 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– లక్ష్మినారాయణ, ఏఈ, ఆర్అండ్‌బీ, కోడుమూరు

### పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

**సి.బెళగల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

**సి.బెళగల్:** మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

## పేరుకుపోయిన చెత్తను తొలగించాలి



ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

**కల్లూరు:** నగరంలోని వీధులలో చెత్త సేకరణ చేస్తూ ఆగిపోయిన వాహనాలను మళ్లీ వినియోగంలోకి తేవాలని సీపీఎం నగర కమిటీ సభ్యుడు యేసు, హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు అర్బన్ 31వ వార్డు పరిధిలోని రాఘవేంద్ర నగర్, సాయి నగర్, బద్రీనాథ్ నగర్, స్వామి నగర్ ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి నగరంలోని కాలనీల్లో చెత్త సేకరణ బండ్లు రాకపోవడంతో చెత్తంతా పేరుకుపోయిందన్నారు. చెత్తను డ్రైనేజీలలో వేస్తుండటంతో పూడికతో నిండిపోతున్నాయన్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల నుంచి వివిధ రకాలు పన్నులు వసూలు చేస్తున్నారు తప్ప సేవలు అందించడం లేదని విమర్శించారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలసి ఆందోళనకు దిగుతామన్నారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, మౌలాలి, రాజు, అయ్యస్వామి, గణేష్, అశోక్, అంజి, మహేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన కర్నూలు జిల్లా వృషభాలు



ఎద్దులు బండను లాగుతున్న దృశ్యం

**ఓర్వకల్లు:** మండలంలోని కాల్వ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీల్లో కర్నూలు జిల్లా వృషభాలు సత్తా చాటాయి. గ్రామంలోని హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి, హజరత్ సయ్యద్ మహియ్యుద్దీన్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపళ్ల విభాగం పోటీలను టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్, మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. 9 ఎడ్ల జతలు పాల్గొనగా పాణ్యం మండలం పిన్నాపురం వెంకట కృష్ణయ్య, ఎమ్మిగనూరుకు చెందిన లక్ష్మినరసింహ వృషభాలు బండను సమాన దూరం లాగి సంయుక్త విజేతగా నిలిచి రూ.70 వేల నగదును కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా రాయవరం అక్షరరెడ్డి వృషభాలు రెండవ స్థానంలో నిలిచి రూ.50 వేలు, నంద్యాల మండలం పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి వృషభాలు మూడో స్థానం కైవసం చేసుకుని రూ.40 వేలు, కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ.20 వేలు, నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ధనుష్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానం దక్కించుకుని రూ.15 వేలు, నంద్యాల జిల్లా చిన్న కానాల చెన్నారెడ్డి వృషభాలు, కోటకందూరు నరసింహారెడ్డి వృషభాలు సంయుక్తంగా ఆరో స్థానతో సరిపెట్టుకుని చెరో రూ.2,500 నగదు బహుమతులు సాధించాయి. వాడాల రామానాయుడు, అబ్దుల్ కలాం వాఖ్యాతలుగా వ్యవహరించారు.

## అమరజీవికి ఘన నివాళి



కోడుమూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**కోడుమూరు రూరల్:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని ఆదివారం కోడుమూరులో ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్పీ జాతీయ, రాష్ట్ర నాయకులు కేవీ రమణ, ఆంధ్రయ్య తదితరులు స్థానిక నాయకులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## బొలెరో ఢీకొని స్కూటరిస్ట్‌కు గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

**సి.బెళగల్:** మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సి.బెళగల్‌కు చెందిన తెలుగు రవి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రామంలోని క్రిష్ణదొడ్డి రోడ్డులో చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే రవి ఆదివారం చేపలను తీసుకుని స్కూటర్‌పై దుకాణానికి వెళ్తుండగా, బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వాసు బొలెరో వాహనంలో వస్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో స్కూటర్ పూర్తిగా ధ్వంసంకాగా తెలుగు రవి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఫిర్యాదు చేశారు. పాత కక్షలను మనసులో పెట్టుకొని వాసు ఉద్దేశపూర్వకంగా తనను వాహనంతో ఢీకొట్టి అక్కడి నుంచి పరారైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ఘటనపై ఎస్ఐ తిమ్మారెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అ'పూర్వ'కలయిక



పోలకల్ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**సి.బెళగల్:** మండల పరిధిలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హైస్కూల్లో 2011 – 2012 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ప్రత్యేకంగా సమావేశమై, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి వారిని జ్ఞాపికలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తాము పాఠశాలలో చదువుకున్న సమయంలో జరిగిన సంఘటనలు గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'పది' పబ్లిక్ పరీక్షలు

- మండలంలో నాలుగు కేంద్రాల్లో జరగనున్న పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సి.బెళగల్ గురుకులంలో ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్ బలరాముడు

**సి.బెళగల్:** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలతో పాటు కొత్తకోట జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహణ అధికారి (కస్టోడియన్) మల్లయ్య, జాయింట్ కస్టోడియన్ అన్వర్‌బాషా, ఎంఈఓ జ్యోతి తెలిపారు. నాలుగు పరీక్ష కేంద్రాలలో 988 మంది రెగ్యులర్ విద్యార్థులు, 349 మంది ప్రైవేట్, కంపార్ట్‌మెంటల్ విద్యార్థులతో మొత్తం 1,337 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ జ్యోతి తెలియజేశారు.

– మండలంలో సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 260 మంది, కొత్తకోట జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 195 మంది, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 213 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పరీక్ష కేంద్రంలో 320 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

**ప్రైవేట్ విద్యార్థులకు మండలంలోనే..**

ప్రైవేటుగా పదవ తరగతి రాసే విద్యార్థులతో పాటు, గతంలో ఫెయిల్ అయ్యి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు సైతం మండలంలోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 100 ప్రైవేట్ విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 108 మంది, కొత్తకోట పరీక్ష కేంద్రంలో 141 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

**144 సెక్షన్ అమలు**

నేటి నుంచి మార్చి 31వ తేదీ వరకు పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎవ్వరు రాకూడదని, పరీక్షలు జరిగే గ్రామాలలో జిరాక్స్ సెంటర్లను సైతం మూసివేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ**



పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం. స్థానిక వైద్యులతో మాట్లాడి అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. – జ్యోతి, సి.బెళగల్ ఎంఈఓ

**నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు**



పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి. మండలంలోని 4 పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎవరైనా అలజడులు సృష్టించాలని చూసినా, నిబంధనలు అతిక్రమించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– తిమ్మారెడ్డి, సి.బెళగల్, ఎస్ఐ

### పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**పాణ్యం:** పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో కేంద్రాల్లో కావాల్సిన మౌలిక సదుపాయలు కల్పించినట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో 6 పరీక్ష కేంద్రాలు ర్పాటు చేశామన్నారు. పాణ్యం-ఏ కేంద్రంలో 220 మంది విద్యార్థులు, పాణ్యం-బీలో 220, విజయానికతన్‌లో 200, నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 190, బీసీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో 190, బలపనూరు ఉన్నత పాఠశాలలో 160 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

### రోగులకు బ్రెడ్డు పంపిణీ

**కర్నూలు(హాస్పిటల్):** తన పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆదివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంఎం-3, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో రోగులకు బ్రెడ్డు, బిస్కట్లు పంపిణీ చేశారు.

## అంజన్నకు కాటసాని పూజలు



పూజల్లో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** కల్లూరు అర్బన్ 32వ వార్డు పరిధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠతోపాటు నవగ్రహ, కుమార స్వామి, దత్తాత్రేయ స్వాముల ప్రతిష్ఠోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, కార్పొరేటర్ సాన శ్రీనివాసులును శాలువాతో సత్కారించారు.

# రోడ్డుకు పన్ను!

- మున్సిపల్ అధికారుల తీరిది
- నగరపాలక సంస్థ లీలలు



మున్సిపల్ అధికారులు పన్ను వేసిన రోడ్డు ఇదే

**కర్నూలు (టౌన్):** ఎక్కడైన ఇళ్లకు పన్ను వేస్తారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే నగర పాలక సంస్థ అధికారులు మాత్రం రోడ్డుకు పన్ను వేశారు. నోటీసులు జారీ చేశారు. తీరా ఇంటి కోసం వెతికితే అది కాస్తా రోడ్డుగా కనిపించింది. ఈ రోడ్డుకు రూ.14,636 పన్ను బకాయిలు చెల్లించాలని పేర్కొనడం విశేషం. వింతగా ఉన్నా.. ఇది వాస్తవమే.. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో నివసించే వారు పన్ను వేయాలంటే తప్పనిసరిగా సదరు ఇంటి యజమాని ఇంటి డాక్యుమెంటు, లింకు డాక్యుమెంటు, ఇంటి ఫొటో, ఆధార్ కార్డు ఇలా.. తప్పనిసరిగా రెవెన్యూ విభాగంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ డాక్యుమెంటు ఉంటేనే వెరిఫికేషన్ చేసిన తరువాత ఆస్తి పన్నును జారీ చేస్తారు. ఇవేవి లేకుండా నగరంలోని 45వ వార్డు అశోక్‌నగర్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి నగర్‌లో ఇంటి నంబర్ 45/24-ఆర్-30-ఎన్-53 కి అసెస్‌మెంటు నంబర్ 1016055715 యజమాని ఏలియా పేరుతో పన్ను రశీదు ఉంది. 2004 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని మున్సిపల్ అధికారులు తిరుగుతున్నారు. ఇళ్లు మాత్రం కనిపించడం లేదు. రోడ్డు తప్పా.. వాస్తవానికి ఒక వైపు వార్డు పరిధిలో సచివాలయాలు ఉన్నాయి. 100 ఇళ్లకు సచివాలయాల సిబ్బంది ఉంటారు. వారంతా అదే ఏరియాలో తిరుగుతున్నారు. 20 సంవత్సరాలుగా పన్ను బకాయిలు ఉంటే ఏం చేస్తున్నారు. విచారణ చేశారా..? వాస్తవాలు తెలుసుకోవాలి. అసలు ఉన్నారా.. లేదా.. ఇళ్లు లేకుంటే ఆ పన్ను ఎలా జనరేట్ చేశారు. ఎవరూ పన్ను చెల్లించాలి.

**శాటిలైట్ ద్వారా కొలతలు అంటే ఇదేనా?**

ఒకవైపు శాటిలైట్ ద్వారా కొలతలు వేస్తున్నాం అంటున్నారు. ఇదేనా.. కనిపించని ఇంటి కోసం పన్ను వేశారు. ఇప్పుడు పన్నులు చెల్లించాలంటూ తిరుగుతున్నారు. ఇదేం విడ్డూరం. వార్డు పరిధిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయాలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై ఉంది. అయినా పొరపాట్లు జరగడం విడ్డూరంగా ఉంది.

– టీ.రాముడు, సీపీఎం మాజీ కార్పొరేటర్